క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్లు పంపిణీ



ప్యాడ్లు అందజేస్తున్న రాజు- పూజిత

గరిడేపల్లి : మండలంలోని తుమ్మాయిగడ్డ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మోదాల మనుశ్రీ పుట్టినరోజు సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు పూజిత- రాజు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో విద్యార్థుల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.మానస, ఎస్ఎంసీ చైర్మన్ గోడుగు స్వాతి, ఉపాధ్యాయులు బి.స్వర్ణలత, బి.శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది నాగేంద్ర, విద్యార్థులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న శ్రీహరి, తదితరులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో శనివారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నళిని, వీరబాబు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రవికుమార్, రామలింగాచారి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సైదులును మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మాశెట్టి శ్రీహరి ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కొలిపాక జగదీష్, పురుషోత్తం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరం గ్రామంలో చేపల చెరువు వేలంపాటను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన కస్తాల సుందర్‌రావు రెండు సంవత్సరాలకు గాను రూ.52 వేలకు దక్కించుకున్నట్లు కార్యదర్శి నస్రా కపిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమాధులను తొలగించడం సరికాదు

నడిగూడెం : సంపద వనాల పేరుతో సమాధులను తొలగించడం సరికాదని మాల మహానాడు మండల నాయకుడు పసుపులేటి మల్లికార్జున్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ కాలువ కట్ట వెంట తమ కుటుంబాలకు చెందిన వారి సమాధులను తొలగించారని, 50 ఏళ్లుగా తమకున్న భూములను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఆరోపించారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కోదాడ : జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 14 శాతానికి మించి స్థానం లభించడం లేదని, బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ నాయకుడు జుట్టుకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే బీసీ జనాభా గణన చేపట్టాలని కోరారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిచడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అంగిరేకుల నాగార్జున, రామినేని శ్రీనివాసరావు, సుంకరి అజయ్‌కుమార్, గోపి, రాంబాబు, జనార్దన్, వేణుదర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

హుజూర్‌నగర్ : అర్హులైన మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలో కె.ముత్తమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో 60 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. వారిని కేటగిరీలుగా విభజించి కనీస వేతనాలు రూ.26 వేలకు తగ్గకుండా ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సైదులు, గోపి, కుమారి, రమణ, రాములు, కాశీ, శ్రీను, యశోద, మరియమ్మ, సంతోషం, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై నేడు అవగాహన సదస్సు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన వాసికర్ల శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రైతు శేషుకుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు, కషాయాలు, మిశ్రమాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు సకాలంలో హాజరై, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆక్రమణలో పోస్టాఫీస్ స్థలం

- డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారస్తులు
- పార్కింగ్ స్థలంగా వినియోగం
- అద్దె భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు



పోస్టాఫీస్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసిన వ్యాపారస్తులు

కోదాడ : పట్టణ నడిబొడ్డున ఉన్న పోస్టాఫీస్ స్థలం ఆక్రమణకు గురవుతోంది. ఆ స్థలం ముందు వైపు పలువురు డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకోగా వెనుక వైపు ఉన్న స్థలాన్ని వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ పార్కింగ్ స్థలంగా మార్చుకున్నారు. మరో వైపు వ్యాపార భవనాన్ని నిర్మించిన కొందరు పోస్టాఫీస్ స్థలంలోనే తమ స్థలం ఉందని అందులోనే మెట్లు నిర్మించుకున్నారు. కొద్ది రోజులైతే అక్కడ పోస్టాఫీస్ స్థలం ఉందనే విషయం కూడా మర్చిపోయే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

30 ఏళ్లుగా అద్దె భవనంలోనే..

కాగా, పట్టణంలోని మసీద్ సమీపంలో జాతీయ రహదారిపై గతంలో పోస్టాఫీస్ ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మిస్తామని పోస్టాఫీస్‌ను అద్దె భవనంలోకి మార్చారు. ఇది జరిగి 30 సంవత్సరాలు కావొస్తుంది. కానీ అప్పటి నుంచి భవన నిర్మాణ విషయం అంగుళం కూడా ముందుకు కదలలేదు. మొదట నయానగర్‌లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను అక్కడి నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వెనుకకు మార్చారు. ప్రస్తుతం అక్కడి నుంచి భవానీనగర్‌కు మార్చారు. నివాసగృహాల మధ్య పోస్టాఫీస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పార్కింగ్ లేక కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సరైన వసతి లేక ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్‌తో ప్రజలతో పాటు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తవారికి ఈ కార్యాలయ అడ్రస్ కూడా కనుక్కోవడం పెద్ద టాస్క్‌గా మారింది. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న ఈ కార్యాలయానికి కొత్తభవనం నిర్మించాలని అనేక సంవత్సరాలుగా చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి తప్పా కార్యరూపంలోకి రావడం లేదు. ఇప్పటికైనా పోస్టాఫీస్‌పాత స్థలంలో కొత్త భవనం నిర్మిస్తే అందరికి సౌకర్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భవనం నిర్మించాలి



80 వేల జనాభా ఉన్న కోదాడ పట్టణంలో పోస్టాఫీస్‌కు సొంత భవనం లేక, అద్దె భవనంలో నిర్వహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తే ప్రజలతో పాటు ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుంది.

– తాటి సత్యనారాయణ, కోదాడ

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



వినాయక మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య దంపతులు

కోదాడ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడ పట్టణంలోని గణపతి మండపాల వద్ద శనివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సనా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం వివిధ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మేకల అభినవ్‌కు ఘన నివాళి



మేకల అభినవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆయన తల్లిదండ్రులు, నేతలు

కోదాడ : చిన్న తనంలోనే దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన అండర్- 11 ఏసియాడ్ చెస్ చాంపియన్ దివంగత మేకల అభినవ్ మృతి క్రీడా లోకానికి తీరని లోటని పలువురు నేతలు అన్నారు. అభినవ్ 22వ వర్ధంతి సందర్భంగా శనివారం కోదాడ బాలుర పాఠశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నయానగర్‌లోని మేకల అభినవ్ వీధికి చేపట్టిన ఆర్చీ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో అభినవ్ తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, అరుణ, సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఎంతఊట సలీం షరీఫ్, సత్యబాబు, కరుణాకర్, అంగిరేకుల నాగర్జున, దొంగరి వెంకటేశ్వర్లు, డాక్టర్ బ్రహ్మం, కొమరగిరి రంగారావు, రామినేని శ్రీనివాస్‌రావు, దొంగరి శ్రీను, తిపిరిశెట్టి రాజు, బాగ్దాద్, సూర్యనారాయణ, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో విజయ్‌కుమార్ పాత్ర మరువలేనిది



విజయ్‌కుమార్ అంతిమయాత్రలో పాల్గొన్న శశిధర్‌రెడ్డి, తదితరులు

కోదాడ : తెలంగాణ మలిదశ ఉద్యమంలో వక్కంతుల విజయ్‌కుమార్ పాత్ర మరువలేనిదని, ఆయన ఆకస్మిక మృతి తెలంగాణవాదానికి తీరని లోటని పలువురు నేతలు అన్నారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వక్కంతుల విజయ్‌కుమార్ అంత్యక్రియలు శనివారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ శ్మశానవాటికలో ముగిశాయి. శుక్రవారం రాత్రి మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ లు విజయ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. శనివారం కోదాడలో న్యాయవాదులు, మలిదశ ఉద్యమకారులు పట్టణంలో నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, ఏర్నేని బాబు, సూర్యం, వెంకటనారాయణ, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, తుపాకుల భాస్కర్, రవి, కోటేశ్వరరావు, నర్సింహరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంకు చెందిన కొందరు ఆటో యూనియన్ వారు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరినట్టు చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆఆర్‌లో చేరిన వారిలో ఏ ఒక్కరు కూడా కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదని, బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుజ్జుల నరేందర్ రెడ్డి, సురేందర్, సామ్యనాయక్, నాగరాజు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ అధికారులు రాజీనామా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్

హుజూర్‌నగర్ : గ్రూప్ -1 పరీక్ష రెండవసారి రద్దు కావడానికి కారణమైన టీఎస్‌పీఎస్సీ అధికారులు వెంటనే రాజీనామా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులు, నిరుద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్ -1 పరీక్ష రద్దుకు సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనే కారణమని ఆరోపించారు. బీఎస్పీ ఆనాడే డిమాండ్ చేసినట్లు మొత్తం టీఎస్‌పీఎస్సీ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పరీక్షలు నిర్వహిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కొత్తగా వచ్చిన 270 ఓఎంఆర్ షీట్లపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, సిట్ ఇన్వెస్టిగేషన్‌లో కమిషన్ చైర్మన్, సభ్యులు, ఎస్ఓలను నిందితులుగా చేర్చాలని కోరారు. అదే విధంగా గ్రూప్- 1 రాసిన అభ్యర్థులకు కనీసం రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. నవంబర్‌లో జరగాల్సిన గ్రూప్ -2, మిగతా పరీక్షలన్నీ కొత్త కమిషన్ హయాంలోనే జరపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.నర్సింహారావు, ఉపాధ్యక్షుడు జె.రామస్వామి, టి.నాగార్జున, ఆర్.స్వరూప్‌రావు, బి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి



హుజూర్‌నగర్ : వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు కోరారు. ఈమేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సుందర మాలీశ్వర రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, దస్తగిరి, మస్తాన్, జానిమియా, మంగయ్య, మధార్, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు మంజూరు చేయాలి

నడిగూడెం : అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన తెలిపి అనంతరం ఆర్ఐ కొండపల్లి గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బీరవల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు రెంటాల శ్రీను, సంపతి పిచ్చయ్య, ముసుకు వీరస్వామి, కందుల సంజీవరావు, కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గణనాథుల శోభాయాత్ర

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రతిష్ఠించిన వినాయకుల విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాల శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించి అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కోదాడ : వినాయకుడి శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు



మఠంపల్లి : కృష్ణానదిలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



నేరేడుచర్లలో..



అనంతగిరి : మొగలాయికోటలో ప్రమోద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



చిలుకూరులో..



హుజూర్‌నగర్ : వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



గరిడేపల్లి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ మేనేజర్ యాకుబ్‌పాషా కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అరుణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, అధ్యాపకులు, వార్డ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో 'స్వచ్ఛతా హీ సేవా'

గరిడేపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కన్మంత రెడ్డి వనజ, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, కోఆప్షన్ సభ్యుడు బొంత వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



హుజూర్‌నగర్ : గుడిమల్కాపురంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని వైస్ ఎంపీపీ పోల్నేడి శ్రీనివాసరావు, సెక్టార్ సూపర్‌వైజర్ బి.సరిత అన్నారు. శనివారం చింతలపాలెం మండలం గుడిమల్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. వారికి పూలు, పండ్లు, గాజులు, చీరలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వచ్చని తెలిపారు. శిశువుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉపేంద్రమ్మ, కార్యదర్శి రఫీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహార వంటల ప్రదర్శన

పాలకవీడు : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని హుజూర్‌నగర్ ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. శనివారం ఆమె శూన్యపహాడ్ గ్రామంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, గుడ్లు వంటి వాటితో చేసిన వంటకాలను ప్రదర్శించి మహిళలకు వివరించారు. పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ రమావత్ భీకి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్-1 పరీక్ష రద్దు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందర్‌రావు

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్- 1 పరీక్ష రద్దు జరిగిందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు ఆరోపించారు. శనివారం మఠంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వ అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి మరోసారి బయటపడిందన్నారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ప్రభుత్వ డొల్లాతనంతో నోటిఫికేషన్‌లు ఇవ్వడం ఎవరో ఒకరు కోర్టులకు వెళ్లడం పరీక్షలు రద్దు కావడం పరిపాటిగా మారడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే టీఎస్పీఎస్సీ కమిటీని ప్రక్షాళన చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు డేవిడ్, మహేష్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న జూపల్లి రామేశ్వరరావు

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ 25 వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత దశమ స్కంద హవనం, పారాయణ ప్రవచనాలు అదేవిధంగా సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం ఇండస్ట్రీస్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు దంపతులు, రామ్మోహనరావు దంపతులు, వినోద్‌రావు, వీఎస్ నారంగ్, చంద్రశేఖర్ పాండే, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ధర్నా ఎన్నికల స్టంట్

మునగాల : రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సుంకర అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్‌నీరు విడుదల చేయాలని మునగాల శివారులో సాగర్ ఎడమ కాలువ వద్ద కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి ధర్నా నిర్వహించడం ఎన్నికల స్టంట్ అని ఆరోపించారు. కరెంట్ కోతతో, సాగు నీటి సమస్యలతో రైతులను సర్వనాశనం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, ఉప్పుల యుగంధర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, చింతకాయల ఉపేందర్, ఉడుం కృష్ణ, శ్రీనివాస్, నాగబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

25న పీడీఎస్‌యూ జిల్లా సదస్సు

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో సెప్టెంబర్ 25న నిర్వహించబోయే పీడీఎస్‌యూ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుజాత, సైదమ్మ, జరీనా, జ్యోతి, స్వాతి, రాజేశ్వరి, హేమ, పావని, రాణి పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగలు ఆరోగ్య సూత్రాలకు ప్రతీకలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మనం నిత్యం పాటించే సంప్రదాయ పండుగలు ఆరోగ్య సూత్రాలకు ప్రతీకలేనని వాసవీ, వనితా క్లబ్‌ల అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలతాకోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం నేరేడుచర్లలోని టాలెంట్ స్కూల్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి సంధ్య, ఈగా భాగ్యలక్ష్మి, కందిబండ వాసంతి, కందిబండ శ్రీనివాస్‌రావు, శ్రీరామ్, ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి, నళిని, రమేష్, ఉపాధ్యాయులు రవీందర్, లత, దీప్తి, తదితరులు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కోదాడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయినా స్వరాష్ట్రం కోసం పోరాడిన తొలి, మలిదశ ఉద్యమకారులకు ఒరిగిందేమీ లేదని 1969 తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కోదాడ పబ్లిక్‌క్లబ్‌లో జరిగిన 1969 తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 3న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పింఛన్, వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కత్రం సీతారామిరెడ్డి, శాకమూడి విశ్వేశ్వరరావు, కొడారి వెంకయ్య, కత్రం శివాజీరెడ్డి, గింజుపల్లి వెంకటేశ్వర్లు, చలిగంటి నర్సయ్య, కందిబండ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువును పర్యవేక్షించాలి

నేరేడుచర్ల : పిల్లల చదువును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నడిగూడెం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కొంపెల్లి గోపిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసోసియేట్ మాజీ అధ్యక్షుడు సామినేని శ్రీనివాసరావు, బానోతు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.